GHMC hmda Growing Global TS-bPASS
MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com
వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
SRI SWAMI ASSOCIATES
ARCHITECTS•ENGINEERS•SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissions, LRS, BRS, Tax Assesments
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణ దరఖాస్తు కొరకు సంప్రదించండి.
GHMC, HMDA, DTCP, TS-bpass - Layout's, Building Permissions
H.No. 11-5-565, Bhagya Laxmi Towers, Opp: GHMC Circle Office, Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595


క్రైమ్ THE మిర్రర్®
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
శుక్రవారం 26-6-2026 పబ్లిషింగ్ సెంటర్ : హైదరాబాద్

## తమ్మడపల్లి హెచ్ఎండిఎ

# వెంచర్ బాగోతం బట్టబయలు..

### గతంలో ప్రభుత్వం కొన్న భూమిని..మళ్లీ అక్రమ వెంచర్‌గా మార్చే ప్రయత్నం

### ఓ ప్రజాప్రతినిధి అండ దండలతో భూ మాయ..






**చారిత్రక సంపద ధ్వంసం**

ఈ వెంచర్ పేరుతో పురాతన బురుజులు, దేవాలయాల స్థలాలు, గ్రామకంఠం భూమిని కబ్జా చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. కోలిచే బాలమ్మ, మైసమ్మ దేవతల గుడి గర్భాలను కూడా తొలగించేందుకు, ప్రయత్నిస్తున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇరిగేషన్ కాలువలను పూడ్చి, మట్టితో కప్పేసి ప్రయత్నాలు జరుగుతున్నాయని అంటున్నారు. రైతుల సాగునీటికి ఆధారమైన చిన్న చిన్న కాలువలు, బావులను ధ్వంసం చేస్తున్నారని వారు చెబుతున్నారు.

**మర్రిగూడ(క్రైమ్ మిర్రర్):**

మండలంలోని తమ్మడపల్లి గ్రామంలో సర్వే నంబర్ 80, 81లలోని ప్రభుత్వ భూమిని అక్రమార్కులు మళ్లీ కబ్జా చేసేందుకు, పావులు కదుపుతున్నారనే ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. సదాశివపేట చారిత్రక సంపదను ధ్వంసం చేస్తూ, నిబంధనలకు విరుద్ధంగా వెలుస్తున్న కొత్త వెంచర్ వ్యవహారం, గ్రామస్తుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. తమ్మడపల్లి గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 80లో దాదాపు 7 ఎకరాల భూమి పూర్తిగా ప్రభుత్వానికి చెందినది. 27జూన్ 1986న ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసి, 12 సెప్టెంబర్ 1986న, ఎలాంటి అభ్యంతరాలు లేవని నిర్ధారించుకున్న అనంతరం, ప్రభుత్వం 17 వేలకు ఈ భూమిని అధికారికంగా కొనుగోలు చేసింది. 21 ఫిబ్రవరి 1987న ప్రభుత్వం ఈ భూమిని వెంచర్ చేసి, పేదలకు ఇండ్ల పట్టాలను పంపిణీ చేసింది. అయినప్పటికీ కొంతమంది అక్రమార్కులు ఇది మాదే భూమి అంటూ, మళ్లీ తెరపైకి వచ్చారు. హెచ్ఎండిఎ అప్రూవల్ ఉందని చెబుతూ, ఇదే భూమిలో మరోసారి వెంచర్ వేసి లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తున్నారు. గత కొద్ది రోజుల క్రితం ఎలాంటి ముందస్తు అనుమతులు లేకుండా, వ్యవసాయ భూమిని నాన్-అగ్రికల్చర్‌గా మార్చకుండానే, జేసీబీలు, ట్రాక్టర్లతో భారీ తవ్వకాలు చేపట్టారు.



**నిఘా వ్యవస్థ నిద్రిస్తే... క్రైమ్ మిర్రర్ కాపు కాస్తుంది**

# రామచంద్రపురంలో బొడ్రాయి, కనకదుర్గమ్మ, ముత్యాలమ్మ, మైసమ్మ తల్లి, ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

**భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహణ.. పెద్ద ఎత్తున హాజరైన గ్రామ ప్రజలు**

**క్రైమ్ మిర్రర్ పాలేరు : నేలకొండపల్లి:** మండలంలోని రామచంద్రపురం గ్రామంలో బొడ్రాయి, కనకదుర్గమ్మ, ముత్యాలమ్మ, మైసమ్మ తల్లి మరియు ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది.ఉదయం నుంచి వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ గణపతి పూజ, పుణ్యాహవచనం, కలశ స్థాపన, హోమాలు నిర్వహించారు. శుభ ముహూర్తంలో విగ్రహాలకు ప్రాణ ప్రతిష్ఠ, కుంభాభిషేకం కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిపారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, రామచంద్రపురం గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకున్నారు. యువకులు, భక్తులు భజనలు, కోలాటాలతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నింపారు.గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠతో పాటు గ్రామ దేవతలైన కనకదుర్గమ్మ, ముత్యాలమ్మ, మైసమ్మ తల్లి, ఆంజనేయస్వామి విగ్రహాలను ప్రతిష్ఠించడం గ్రామానికి శుభ సూచకమని, ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖశాంతులు కలుగుతాయని



గ్రామ పెద్దలు ఆకాంక్షించారు.విగ్రహ ప్రతిష్ఠ అనంతరం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుండి తరలివచ్చిన భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ గ్రామ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# తమ్మడపల్లి హెచ్ఎండిఎ వెంచర్ బాగోతం బట్టబయలు..



**అక్రమాలను వెలికి తీసిన క్రైమ్ మిర్రర్**

ఈ అక్రమాలపై క్రైమ్ మిర్రర్ పత్రిక 22 మే 2026, 25 మే 2026 తేది సంచికల్లో వరుస కథనాలను ప్రచురించింది. సరైన అనుమతులు లేని అక్రమ వెంచర్, తమ్మడపల్లిలో వెలుసిన నూతన వెంచర్ అనే, శీర్షికలతో వెలువడిన కథనాల్లో భూమి కబ్జా, చారిత్రక సంపద ధ్వంసం, నిబంధనల ఉల్లంఘన తదితర అంశాలను వివరంగా వెలుగులోకి తెచ్చింది. క్రైమ్ మిర్రర్ కథనాల ఆధారంగా, హెచ్ఎండిఎ అధికారులు, ఇరిగేషన్ శాఖ, సంబంధిత శాఖ అధికారులకు అధికారికంగా లేఖ రాసినట్లు సమాచారం. జిల్లా కలెక్టర్, హెచ్ఎండిఎ కమిషనర్, విజిలెన్స్ అధికారులు వెంటనే స్పందించి, అక్రమ వెంచర్ పనులను నిలిపివేయాలని, సర్వే నంబర్ 80, 81 లపై సమగ్ర విచారణ జరిపి గ్రామకంఠం, బురుజులు, దేవాలయాల స్థలాలను కాపాడాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

**ప్రశ్నార్థకంగా మారుతున్న అనుమతులు**

నిబంధనల ప్రకారం వ్యవసాయ భూమిని వెంచర్‌గా మార్చాలంటే, నాన్-అగ్రికల్చర్ కన్వర్షన్ పూర్తి చేసి, డీటీసీపీ లేదా హెచ్ఎండిఎ అనుమతులు తీసుకోవాలి. కానీ ఇక్కడ ఎలాంటి అనుమతులు లేకుండానే పనులు జరుగుతున్నాయనే, అనుమానాలు బలంగా వినిపిస్తున్నాయి. హెచ్ఎండిఎ అప్రూవల్ పేరుతో ప్రజలను మభ్యపెడుతున్నారా, అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గత కొన్నేళ్లకు ముందు ఇదే భూమిలో గుప్తనిధుల తవ్వకాలు జరిగి వివాదం చెలరేగింది. ఇప్పుడు మళ్లీ అదే తంతు పునరావృతమవుతుండడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు వెంటనే రంగంలోకి దిగి స్థల పరిశీలన చేసి, దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. ప్రభుత్వం ఇప్పటికే కొనుగోలు చేసి పేదలకు పంపిణీ చేసిన భూమిపై మళ్లీ కన్నేయడం, చారిత్రక సంపదను ధ్వంసం చేయడం పట్ల ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఈ వ్యవహారంపై రెవెన్యూ, హెచ్ఎండిఎ, ఇరిగేషన్ శాఖలు ఎలా స్పందిస్తాయో వేచి చూడాలి.



# రామచంద్రపురంలో యాంటీ డ్రగ్స్ అవేర్‌నెస్ కార్యక్రమం

**మత్తు పదార్థాలకు దూరంగా ఉందాం.. యువతకు పోలీసుల పిలుపు**

**క్రైమ్ మిర్రర్ పాలేరు :** నేలకొండపల్లి,మండలంలోని రామచంద్రపురం గ్రామంలో శుక్రవారం యాంటీ డ్రగ్స్ అవేర్‌నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. నేలకొండపల్లి పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు.నేలకొండపల్లి ఎఎస్ ఐ బి. కోటేశ్వరరావు మాట్లాడుతూ "గంజాయి, గుట్కా, మద్యం వంటి మత్తు పదార్థాలకు యువత బానిసై జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. ఒక్కసారి అలవాటు పడితే బయటపడటం కష్టం. కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నాయి" అని హెచ్చరించారు. డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలు, చట్టపరమైన శిక్షల గురించి వివరించారు. గ్రామంలో ఎవరైనా గంజాయి, ఇతర మత్తు పదార్థాలు విక్రయిస్తున్నా, సేవిస్తున్నా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని హెచ్ సి ఎం డి. కాసీం కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో , ఎస్ శ్రీనివాసరావు, శివలాల్, శ్రీను, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తుంది.

**- మాజీ జెడ్పిటిసి తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి.**

**కేశంపేట,( క్రైమ్ మిర్రర్):** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని ఎల్లప్పుడూ గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తుందని మాజీ జెడ్పిటిసి తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి అన్నారు.గురువారం మండల పరిధిలోని పాపిరెడ్డి గూడ గ్రామంలో 10 లక్షల రూపాయలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను గ్రామ సర్పంచ్ శశిరేఖ యాదయ్య తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వాన్ని బడుగు బలహీన వర్గాల కోసం ఎల్లప్పుడూ కృషి చేస్తుందన్నారు. గ్రామాభివృద్ధికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఎంతగానో సహకారం అందిస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి రఘు, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు గుండె రాణి, అబ్బి సుందరయ్య, మాజీ సర్పంచ్ శివయ్య, వార్డు సభ్యులు బాలకృష్ణ, రవి, సురేష్, నందు, రామకృష్ణ, శ్రీను. మరియు తాండ్ర శ్రవణ్ రెడ్డి, కృష్ణారెడ్డి, శంకర్, సత్యం, యాదయ్య, రఘు, బాలరాజ్, నర్సింలు, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



## పవిత్ర ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని చిన్నారులకు అల్పాహార వితరణ



**ఎల్బీనగర్ జూన్ 25 క్రైమ్ మిర్రర్ ప్రతినిధి :** గురువారం రోజు పవిత్ర ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని కృష్ణ గోపాల్ సేవా సమితి ఆధ్వర్యంలో నిరుపేద చిన్నారుల పాఠశాలలో ఉదయం అల్పాహారం అందజేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సేవా కార్యక్రమంలో కృష్ణ గోపాల్ సేవా సమితి అధ్యక్షులు డాక్టర్ కపిల్ కుమార్ అగర్వాల్ తో పాటు సేవా సమితి సభ్యులు అందరూ పాల్గొని అల్పాహార వితరణ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. మానవసేవే మాధవసేవ, అనే లక్ష్యంతో మా సేవా సమితి నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందని మీలో ఎవరైనా ఈ అనాధ చిన్నారులకు ఒక పూట భోజనాన్ని అందించి వారి ముఖాల్లో చిరునవ్వులు పూయించాలని అనుకుంటే దయచేసి మా సమితి నెంబర్ 8106876999 ను సంప్రదించగలరని డాక్టర్ కపిల్ కుమార్ అగర్వాల్ విజ్ఞప్తి చేశారు.

## బిఆర్ఎస్ నాయకురాలు శైలజ పై మైనంపల్లి అనుచరుల అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నాం

**ఎల్బీనగర్ నియోజకవర్గం సీనియర్ బిఆర్ఎస్ మహిళా నాయకురాళ్ళు**

**ఎల్బీనగర్ జూన్ 25 క్రైమ్ మిర్రర్ ప్రతినిధి:** ఎల్.బి.నగర్ నియోజకవర్గం బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకురాలు శైలజ పై మైనంపల్లి అనుచరులు చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండించిన బీఆర్ఎస్ మహిళా నాయకురాళ్లు. అనంతరం నాగోల్ పోలీస్ స్టేషన్ లో సర్కిల్ ఇన్స్పెక్టర్ మక్బూల్ జానీ కి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళా నాయకుల పట్ల అవమానకరంగా, అసభ్యకరంగా వ్యవహరించడం తీవ్రంగా ఖండించదగిన విషయమని పేర్కొన్నారు.మహిళల గౌరవాన్ని దెబ్బతీసే విధంగా వ్యాఖ్యలు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని,బాధ్యులైన వ్యక్తులను వెంటనే అరెస్టు చేయాలని కోరారు.ఇలాంటి ఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని,మహిళల పట్ల గౌరవం మరియు భద్రతను కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు రంగేశ్వరి నాయుడు, సూరజ్ యస్దాని,రమాదేవి, విజయగౌడ్,దేవి గౌడ్, పార్వతి,కల్పన, మమత, నిర్మల, పద్మ, విజయలక్ష్మి, సరళ, వరలక్ష్మి, నాగమణి, అనురాధ,వీణ, సురేఖ మరియు పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.




# ఖాకీల కార్డన్ అండ్ సెర్చ్..శాంతిభద్రతలే లక్ష్యం..!!

- అక్రమ కార్యకలాపాల నియంత్రణే లక్ష్యం
- ఇంటింటి తనిఖీలతో గ్రామాన్ని జల్లెడ పట్టిన పోలీసులు
- 65 వాహనాల తనిఖీ.. 6 వాహనాలు స్టేషన్‌కు తరలింపు
- గుడుంబా, మత్తు పదార్థాలపై ప్రజలకు అవగాహన
- అనుమానితుల సమాచారం వెంటనే ఇవ్వాలని పోలీసుల విజ్ఞప్తి

**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని అంబట్ పల్లి గ్రామంలో అక్రమ కార్యకలాపాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నివారణ లక్ష్యంగా పోలీసులు గురువారం తెల్లవారుజామున విస్తృత స్థాయిలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. కాటారం డీఎస్పీ సూర్యనారాయణ ఆదేశాల మేరకు మహదేవపూర్ సీఐ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో మహదేవపూర్ ఎస్‌హెచ్‌ఓ ఎం. సాంబమూర్తి, ఎస్ఐ జె. రమేష్, కాళేశ్వరం ఎస్ఐ భగవత్, పలిమెల ఎస్ఐ టి. సాయి శశాంక్‌తో పాటు పోలీసు సిబ్బంది గ్రామాన్ని పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకుని ఇంటింటి తనిఖీలు చేపట్టారు. తనిఖీల సందర్భంగా అనుమానిత వ్యక్తులు, నేరచరిత్ర కలిగిన వ్యక్తుల వివరాలను సేకరించి ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో 30 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. అలాగే మొత్తం 65 వాహనాలను తనిఖీ చేయగా, నంబర్ ప్లేట్లు లేని 6 వాహనాలను గుర్తించి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వాహనాల పత్రాలు, డ్రైవింగ్ లైసెన్సులు, ఇతర రికార్డులను పరిశీలించి, సరైన పత్రాలు లేని వాహనదారులకు జరిమానాలు విధించారు. డీఎస్పీ సూర్యనారాయణ మాట్లాడుతూ..దగ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు అక్రమ కార్యకలాపాల నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రజల సహకారంతో నేరాలను సమర్థవంతంగా అరికట్టగలమని పేర్కొన్నారు. నేరాల నియంత్రణ కోసం కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు నిరంతరం కొనసాగుతాయని చెప్పారు. గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



**మహాదేవపూర్ సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ..**

గుడుంబా తయారీ, విక్రయాలు, వినియోగంపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమ మద్యం వ్యాపారంపై సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. వాహనదారులు తప్పనిసరిగా వాహన పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్, నంబర్ ప్లేట్లు సక్రమంగా కలిగి ఉండాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్‌హెచ్‌ఓ ఎం. సాంబమూర్తి మాట్లాడుతూ..గుడుంబా సేవించడం వల్ల ఆరోగ్య సమస్యలు, కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందన్నారు. గ్రామస్తులు గుడుంబా వంటి దుష్ప్రవర్తనలకు దూరంగా ఉండాలని సూచించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. గ్రామాల్లో మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రజలు పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా సంఘటనల గురించి వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని గ్రామస్తులను కోరిన పోలీసులు, ప్రజల సహకారంతో గ్రామాల్లో శాంతిభద్రతలను మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. ఇటువంటి ప్రత్యేక తనిఖీలు భవిష్యత్తులో కూడా కొనసాగుతాయని స్పష్టం చేశారు.

# ఇంటింటికీ సర్ ఫారాలు..ఓటర్ల నమోదు ప్రక్రియపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి

- సర్ ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మం
- ఓటర్లందరూ సహకరించాలని పిలుపు
- పారదర్శకంగా, వేగవంతంగా కార్యక్రమం అమలు చేయాలని అధికారులకు ఆదేశం

**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి:** ఓటరు జాబితా సవరణ ప్రక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భూపాలపల్లిలోని 24వ పోలింగ్ కేంద్రం పరిధిలో ఉన్న కృష్ణ కాలనీ, కార్ల్ మార్క్స్ కాలనీలలో జరుగుతున్న సర్ ప్రక్రియను ఆయన ప్రత్యక్షంగా సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా బూత్ లెవల్ అధికారులు ఇంటింటికీ వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలను వేగంగా పంపిణీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. 2002 ఓటరు జాబితాను ప్రామాణికంగా తీసుకుని ప్రతి ఓటరుకు అవగాహన కల్పించాలని, అర్హులైన వారందరి వివరాలను నమోదు చేసే ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యం చోటుచేసుకోకూడదని సూచించారు. అలాగే ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను కూడా వెంటనే ప్రారంభించి, ఓటర్లకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని బీఎల్‌ఓ లకు సూచించారు. ఓటరు జాబితా సవరణ కార్యక్రమం పారదర్శకంగా, సమర్థవంతంగా సాగేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ "సర్ కార్యక్రమం ద్వారా ఓటరు జాబితాను మరింత కచ్చితంగా రూపొందించే అవకాశం ఉంది. ప్రతి అర్హుడైన ఓటరికి సమాచారం చేరేలా చర్యలు తీసుకోవాలి. ప్రజలు కూడా కార్యక్రమంలో భాగస్వాములై అవసరమైన వివరాలు అందించి సహకరించాలి" అని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. సర్ కార్యక్రమం విజయవంతం కావడానికి ప్రజల సహకారం అత్యంత అవసరమని పేర్కొన్న ఆయన, అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీరాజయ్య, జీపీఓలు అనిల్ కుమార్, కిరణ్, బీఎల్‌ఓలు, బీఎల్‌ఏలు తదితరులు పాల్గొన్నారు.





# సికిందర్గూడ భూ వివాదంలో మరో మలుపు

- తనపై కుట్రపూరిత దుష్ప్రచారమంటూ ఆవేదన చెందిన నాగుల నరేందర్ద
- ఎఫ్ఐఆర్ నమోదై 40 రోజులు గడిచినా దర్యాప్తులో పురోగతి లేదని విమర్శ
- బండ్లగూడ చౌరస్తాలో అక్రమాలపై ప్రత్యేక స్క్రీనింగ్ ఏర్పాటు చేస్తానని స్పష్టీకరణ
- నిజాలతో ప్రజలకు వివరిస్తా






**గండిపేట్ : ( క్రైమ్ మిర్రర్ ):** రాజేంద్రనగర్ సర్కిల్ బండ్లగూడ జాగీర్ పరిధి సికిందర్ గూడ సర్వే నంబర్ 1/పి భూ వివాదం మరోసారి చర్చకు దారి తీసింది. ఈ వివాదానికి సంబంధించి తనపై జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని, తన ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు కొందరు కుట్ర చేస్తున్నారని మాజీ వార్డు సభ్యుడు నాగుల నరేందర్ ఆరోపించారు. రాజకీయంగా ఎదుర్కోలేక ఇలాంటి ఆరోపణలు చేయడం ఏంటని మండిపడ్డారు. బండ్లగూడ జాగీర్ అభ్యుదయనగర్ కమిటీ హాల్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సికిందర్ గూడ సర్వే నంబర్ 1/పి పరిధిలోని ప్లాట్ నంబర్లు 40, 41 తనవేనంటూ బిల్డర్ రాజశేఖర్ రెడ్డి చేస్తున్న ప్రచారం సరైంది కాదన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని వాస్తవాలు త్వరలోనే ప్రజల ముందుకు తీసుకువస్తానని తెలిపారు. తాను 2026లో ప్రకాశ్ గౌడ్ కుటుంబ సభ్యుల నుంచి 400 గజాల స్థలాన్ని కొనుగోలు చేసి, అదే ఏడాది ఫిబ్రవరి 27న అధికారికంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నానని వివరించారు. అయితే అదే స్థలానికి మరో వ్యక్తి పేరుతో కూడా రిజిస్ట్రేషన్ జరగడం పలు అనుమానాలకు తావిస్తోందని పేర్కొన్నారు. ఈ అంశంపై సమగ్ర విచారణ జరగాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. భూ వివాదానికి సంబంధించి రాజేంద్రనగర్ పోలీసుస్టేషన్ లో ఫిర్యాదు చేసి ఎఫ్ఐఆర్ నమోదు చేయించినప్పటికీ 40 రోజులుగా దర్యాప్తులో ఎలాంటి పురోగతి కనిపించడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. డీసీపీ, పోలీస్ కమిషనర్, హోం సెక్రటరీ దృష్టికి సమస్యను తీసుకెళ్లినా స్పందన లేకపోవడం ఆశ్చర్యకరమని అన్నారు. కేసు నమోదైన తర్వాత ఇప్పటివరకు ఎవరినీ విచారణకు పిలవకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మున్సిపల్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినప్ప టికీ స్పందన లభించలేదని, ఆర్టీఐ ద్వారా సమాచారం కోరగా ఆన్లైన్లో పరిశీలించాలని సూచించారన్నారు. అయితే సంబంధిత సమాచారం ఆన్లైన్లో కూడా అందుబాటులో లేకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. కొందరు వ్యక్తులకు అధికారులు సహకరిస్తున్నారనే భావన ప్రజల్లో కలుగుతోందని వ్యాఖ్యానించారు. సర్వే నెంబర్ 1/ పి ప్లాట్ నంబర్లు 40, 41కు సంబంధించిన వివాదం ప్రస్తుతం కోర్టు పరిధిలో ఉందని, న్యాయపరంగా తాను బలమైన స్థితిలో ఉన్నానని నరేందర్ పేర్కొన్నారు. కోర్టు ఇచ్చే తీర్పును పూర్తిగా గౌరవిస్తానని స్పష్టం చేశారు. ఇటీవల రాజశేఖర్ రెడ్డి నిర్వహించిన విలేకరుల సమావేశంలో తనపై చేసిన ఆరోపణలు పూర్తిగా నిరాధారమన్నారు. సికిందర్ గూడ సర్వే నంబర్ 1/పి లో జరుగుతున్న అక్రమాలు, అన్యాయాలను ప్రజల ముందుకు తీసుకురావడానికి బండ్లగూడ చౌరస్తాలో ప్రత్యేక స్క్రీనింగ్ ఏర్పాటు చేసి పూర్తి వివరాలను ప్రదర్శిస్తానని నాగుల నరేందర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

# చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలను తప్పనిసరి వేయించాలి

**-మండల వైద్యాధికారి డాక్టర్ కాటమ్ రాజు**



**చౌటుప్పల్, జూన్ 25, క్రైమ్ మిర్రర్:** దేశవ్యాప్తంగా ఈనెల 28 వ తేదీ ఆదివారం రోజున పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తల్లిదండ్రులు తప్పక సద్వినియోగం చేసుకోవాలని మండల వైద్యాధికారి డాక్టర్ కాటంరాజు కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..పోలియో రహిత భారతదేశాన్ని నిర్మించడానికి ప్రతి ఒక్కరూ ముందుండాలన్నారు. 0–5 సంవత్సరాలలోపు ఉన్న ప్రతి చిన్నారులకు ఈ పల్స్ పోలియో చుక్కలు మర్చిపోకుండా తల్లిదండ్రులు వేయించగలరని విజ్ఞప్తి చేశారు. చౌటుప్పల మండల వ్యాప్తంగా 5959 మంది ఐదు సంవత్సరాలలోపు చిన్నారులు ఉన్నట్టు గుర్తించడం జరిగిందన్నారు. ఆదివారం రోజు తప్పకుండా పోలియో చుక్కలు నిర్దేశించిన ప్రదేశాల వద్ద వేయించుకోవాలని తెలిపారు. చౌటుప్పల్ మండల వ్యాప్తంగా మొత్తం 52 పల్స్ పోలియో కేంద్రాలను ఆదివారం రోజు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.ఒకవేళ ఏదైనా కారణం చేత ఆదివారం రోజు పోలియో చుక్కలు వేయించుకొని వారి కోసం సోమ, మంగళవారం రోజు ఇంటింటికి వచ్చి పోలియో చుక్కలు వేయడం జరుగుతుందన్నారు. క పల్స్ పోలియో కార్యక్రమం గురించి ప్రజా ప్రతినిధులు, అధికారులు, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు, అంగన్వాడీ టీచర్లు, పాత్రికేయ మిత్రులు మరియు ప్రజలు అందరికి తెలియజేయాలనీ, 100% పోలియో రహిత సమాజాన్ని నిర్మిచడంలో భాగస్వాములు కావాలని,ఇట్టి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనీ డాక్టర్ కాటంరాజు కోరారు.

# సర్ తొలి రోజు విజయవంతం



**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన సర్ కార్యక్రమం గురువారం తొలిరోజు విజయవంతంగా ముగిసింది. నేలకొండపల్లి మండలం లోని మొత్తం 32 గ్రామ పంచాయతీలలో 59 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. వీటి లో బీఎల్వే లు తొలి రోజు లాంచనంగా ప్రారంభించారు. 59 మంది బీఎల్ వో లు ఫారాలు పంపిణీ కార్యక్రమం ను చేపట్టారు. తహశీల్దార్ రాంప్రసాద్ తో పాటు ఆరుగురు సూపర్వైజర్లు సర్ కార్యక్రమం ను పర్యవేక్షించారు. కొత్తకొత్తూరు లో నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల సీతారాములు కు ఎన్యూమరేషన్ పారాం ను బీఎల్వో అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కళావతి, ఉప సర్పంచ్ వల్లాల రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు. మండలం లోని ఇంటింటి కార్యక్రమం ను ఆయా పంచాయతీ సర్పంచ్ లకు ఫారాలు అందించి కార్యక్రమాలను ప్రారంభించారు.

# సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి : సిద్దల లార్డ్స్ బీరప్ప



**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్) :** జిహెచ్ఎంసి 59వ డివిజన్ జిల్లెల్లగూడ పరిధిలో నిర్వహించిన ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ కార్పొరేటర్ సిద్ధాల లార్డ్స్ బీరప్ప అర్హులైన మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిద్ధాల లార్డ్స్ బీరప్ప మాట్లాడుతూ, మహిళల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మహిళల అభ్యున్నతి, సాధికారతకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఇందిరమ్మ చీరలను స్వీకరించారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడంలో స్థానిక నాయకులు మరియు కార్యకర్తలు విశేషంగా కృషి చేశారు. ఈ కార్యక్రమంలో కరుణాకర్ యాదవ్, శరణ్ బసప్ప, మాచర్ల అవినాష్, సిద్ధాల భరత్, శ్రీనివాస్ యాదవ్, రిసోర్స్ పర్సన్ గీత, మహిళా నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ఇటువంటి సేవా కార్యక్రమాలు కొనసాగుతాయని మాజీ కార్పొరేటర్ సిద్ధాల లార్డ్స్ బీరప్ప తెలిపారు.

# మహిళలకు చీరలు పంపిణీ చేసిన జిల్లా అధ్యక్షులు చల్ల నరసింహారెడ్డి

**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్):** మహేశ్వరం నియోజకవర్గం జిహెచ్ఎంసి బడంగ్పేట్ సర్కిల్ పరిధిలోని జిల్లేలగూడలో బడంగ్పేట్ డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య, గంగమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా వచ్చిన చీరల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మరియు టియుఎఫ్ఐడిసి చైర్మన్ చల్ల నరసింహ రెడ్డి హాజరై మహిళలకు చీరల పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ జెడ్పిటిసి అనిత రెడ్డి, సిద్ధార్థ దశరథ్, పల్లె పాండు, వెంకటేష్ గౌడ్, మాజీ కార్పొరేటర్ చల్ల బాల్ రెడ్డి, గజ్జల రామచందర్, సురేందర్, సంతోష్ కుమార్, మీర్పేట్ సోషల్ మీడియా బావోజు సిద్దేశ్వర చారి, వెంకటేష్, పైల శేఖర్ రెడ్డి, పరశురాం, శ్రీనివాస్, సుధాకర్, సురేష్ మరియు నాయకులు, మహిళా నాయకులు, పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగింది.






## మాదకద్రవ్యాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దు

**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్):** మారకద్రవ్యాల నిర్మూలనకు మరియు యువతలో మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై మీర్పేట్ పోలీసుల ఆధ్వర్యంలో టికేఆర్ కాలేజ్ విద్యార్థులతో కలిసి నందనవనం పరిసర ప్రాంతాలలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. గంజాయి, మత్తు పదార్థాలు ఉపయోగిస్తున్న వారి వివరాలు పోలీసులకు అందజేయాలని కోరుతూ, మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని, యువతకు సూచిస్తూ ఎన్డిపిఎస్ చట్టంలోని నిబంధనల గురించి మరియు డ్రగ్స్ విక్రయానికి సంబంధించిన ఏదైనా సమాచారం తెలిస్తే పోలీసులకు తెలియజేయడం యేక్క ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు వివరించడం జరిగింది.

## జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారిగా వి. వేణుగోపాల్ రెడ్డి బాధ్యతల స్వీకరణ



**క్రైమ్ మిర్రర్, కల్వకుర్తి (నాగర్ కర్నూలు):** నాగర్‌కర్నూల్ జిల్లా నూతన ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారిగా (డీపీఈఓ) వి. వేణుగోపాల్ రెడ్డి గురువారం ఐడీఓసీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా శాఖ అధికారులు, సిబ్బంది ఆయనకు ఘన స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలియజేశారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం వేణుగోపాల్ రెడ్డి నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లాలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ నిర్వహిస్తున్న కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ విధానాల అమలు, శాఖ పరిధిలో చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. జిల్లాలో అక్రమ మద్యం తయారీ, రవాణా, విక్రయాల నియంత్రణతో పాటు మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే సూచించారు. యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, చట్టవిరుద్ధ కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలను సమర్థవంతంగా అమలు చేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా జిల్లాలో ఎక్సైజ్ శాఖ పనితీరును మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తానన్నారు. అక్రమ కార్యకలాపాల నిర్మూలన, ప్రభుత్వ ఆదాయ వృద్ధి, ప్రజల్లో చట్టాలపై అవగాహన కల్పించడం, పారదర్శక పరిపాలన అందించడం తన ప్రధాన లక్ష్యాలని తెలిపారు. నూతన అధికారికి ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి శుభాకాంక్షలు తెలియజేస్తూ, జిల్లా అభివృద్ధి మరియు శాఖ కార్యక్రమాల విజయవంతమైన అమలుకు తన పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కులమతాలకతీతంగా నిర్వహణ

- ప్రత్యేక ఆకర్షణగా పెద్దగూడెం బురన్ బాబా సవారి ...
- దర్గాను దర్శించుకునేందుకు కర్ణాటక.ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల నుంచి భక్తులు....





**క్రైమ్ మిర్రర్ ప్రతినిధి వనపర్తి:** వనపర్తి జిల్లాలో పీర్లపండుగ(మొహర్రం) పెద్దఎత్తున ప్రారంభమైంది. కర్బలా మైదానంలో మహమ్మద్ ప్రవక్త మనుమడు ఇమాం హుస్సేన్ బలిదానాన్ని స్మరిస్తూ ముస్లింల్లోని ఓవర్గం మొహర్రంను నిర్వహించడం సంప్రదాయంగా వస్తోంది. ఇస్లామిక్ క్యాలెండరు ప్రకారం మొదటి మాసాన్ని మొహర్రం నెలగా భావిస్తారు. ఈమాసంలోనే పది రోజులు పవిత్ర దినాలుగా భావిస్తూ మొహర్రం నిర్వహిస్తారు.

**హిందూ ముస్లింలు కలిసిమెలిసి..**

పూర్వకాలం నుంచి హిందూ ముస్లింలు కులమతాలకతీతంగా జరుపుకునే మొహర్రం పర్వది నానికి గ్రామాల్లో ఎంతో ప్రత్యేకత ఉంది. పట్టణాలు, గ్రామాలు అన్నతేడా లేకుండా వారం రోజుల పాటు హిందూ ముస్లింలు భాయి.. భాయి.. అంటూ మొహర్రం పర్వదినంలో పాల్గొని పూజలు నిర్వహిం చడం ఆనవాయితీగా వస్తోంది. ముస్లింలకు సంబంధించిన ఏపర్వదినానికి లేనివిధంగా మొహర్రం (పీర్లపండుగ)ల్లో హిందువులు పెద్దఎత్తున పాల్గొనడం ప్రత్యేకతగా నిలుస్తుంది.

**ప్రత్యేక ఆకర్షణగా పెద్దగూడెం బురన్ షా సవారి ...**

వనపర్తి జిల్లా లో పెద్దగూడెం పీర్ల మసీదుకు భక్తులు ప్రతి సంవత్సరం పెరుగుతూ వస్తున్నారు. వారసత్వంగా తరతరాల నుంచి వస్తున్న తాత ముత్తాతల చిన్నా జాఫర్షా.పెద్ద జాఫర్ష.ఎత్తుం ముత్తుమ్.రసూల్ ఉస్మాన్ జాఫర్ వారసుడు బురాన్ షా పెద్దగూడెం గుట్టపైన దర్గా నిర్మించాడు దర్గాకు వచ్చిన భక్తులకు కోరిన కోరికలు నెరవేరుతున్నాయని భక్తులు ఎక్కువగా వస్తున్నారు ఉభయ తెలుగు రాష్ట్రాల తోపాటు కర్ణాటక భక్తులు వెల సంఖ్యలో హాజరవుతారు. మొహరం వేడుకల్లో భాగంగా నిర్వహించే బూరన్ బాబా దర్గా సవారి ఊరేగింపు చూసేందుకు భక్తులు వేల సంఖ్యలో వస్తున్నారు. భక్తుల రాకతో గ్రామంలో సందడి గా ఉంటుంది. భక్తులు మేళ తాళాలతో పెద్ద పీర్ల మసీద్ దగ్గర, బురాన్ బాబా పీర్ల దర్గాను దర్శించుకుని దర్గా చుట్టూ ప్రదక్షిణలు చేసి భక్తులు గొర్రెలు, మేకలతో కందూర్లు నిర్వహించి మొక్కులు చెల్లించుకుంటారు. మరి కొందరు బెల్లం, పుట్నాలు, గోధుమలతో తయారుచేసిన మలీజా నైవేద్యాన్ని సమర్పిస్తారు.గ్రామంలో శాంతిభద్రతలను పరిరక్షించేందుకు పోలీసులతో కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేస్తారు. తొమ్మిదిరోజుల పాటు పూజలు, ప్రార్థనలు, ఊరేగింపులు నిర్వహించి ముస్లింలతో పాటు,హిందూ భక్తులు. పీర్ల స్వాముల ఊరేగింపులో అగ్నిగుండం ప్రవేశం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు. పీర్ల నిమజ్జనంతో పీర్ల పండుగ ముగుస్తుంది.

# ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ కు శ్రీకారం చుట్టిన కలెక్టర్

**యాదాద్రి జిల్లా, జూన్ 25, క్రైమ్ మిర్రర్:** యాదాద్రి భువనగిరి జిల్లాలో ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి శ్రీకారం చుట్టారు గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో తెలంగాణ రాష్ట్రంలో ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ అమలులో మోడల్ డిస్ట్రిక్టా ఎంపికైన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అధ్యక్షతన జిల్లా అధికారులతో సమీక్ష సమావేశంను నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..ఆరోగ్య రంగాన్ని పూర్తిస్థాయిలో డిజిటలైజ్ చేయడం, ప్రతి పౌరుడి ఆరోగ్య సమాచారాన్ని ఒకే వేదికపై అందుబాటులో ఉంచడం ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా హెల్త్ ఫెసిలిటీ రిజిస్ట్రీ మరియు హెల్త్ ప్రొఫెషనల్ రిజిస్ట్రీ నమోదులను వేగవంతం చేయాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు, క్లినిక్‌లు, డయాగ్నస్టిక్ సెంటర్లు, ల్యాబొరేటరీలు, ఫార్మసీలు మరియు వైద్య నిపుణులందరూ ఈ డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లో నమోదు కావాల్సి ఉంటుందని తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ వైద్య సంస్థలు మరియు ఆరోగ్య సిబ్బంది తప్పనిసరిగా హెల్త్ ప్రొఫెషనల్ రిజిస్టరీ, హెల్త్ ఫెసిలిటీ రిజిస్ట్రీ నమోదులు పూర్తి చేయాలని సూచించారు. వైద్యులచే జారీ చేయబడే డిజిటల్ ప్రిస్క్రిప్షన్లు, ఆరోగ్య రికార్డుల డిజిటల్ నిర్వహణ ద్వారా ప్రజలకు మెరుగైన, పారదర్శకమైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని వివరించారు. ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ అమలును పర్యవేక్షించేందుకు జిల్లాలో ప్రత్యేక కమిటీలు, ఫీల్డ్ బృందాలు ఏర్పాటు చేయబడినట్లు కలెక్టర్ తెలిపారు. వచ్చే రెండు వారాల్లో జిల్లాలోని అన్ని అర్హత కలిగిన ఆరోగ్య సంస్థలు, వైద్య నిపుణుల నమోదులు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమం దేశంలోనే అతిపెద్ద డిజిటల్ ఆరోగ్య సంస్కరణల్లో ఒకటిగా నిలుస్తుందని, యాదాద్రి భువనగిరి జిల్లాను రాష్ట్రంలో ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి శాఖ సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ ద్వారా పౌరుల ఆరోగ్య రికార్డులు సురక్షితంగా, సులభంగా అందుబాటులో ఉండే డిజిటల్ ఆరోగ్య వ్యవస్థ ఏర్పడుతుందని తెలిపారు.ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ కింద ప్రతి పౌరునికి ఐడి రూపొందించడం ద్వారా వారి ఆరోగ్య రికార్డులను డిజిటల్ రూపంలో అనుసంధానం చేయవచ్చన్నారు . రోగి అనుమతితో దేశంలోని ఏ ప్రభుత్వ లేదా ప్రైవేటు ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్-నమోదిత ఆసుపత్రిలోనైనా గత వైద్య చరిత్ర, పరీక్షా నివేదికలు, ప్రిస్క్రిప్షన్లు మరియు ఇతర ఆరోగ్య వివరాలను పరిశీలించి, వేగవంతమైన మరియు నాణ్యమైన వైద్య సేవలు అందించవచ్చు. దీంతో కాగితపు రికార్డుల అవసరం తగ్గి, అత్యవసర పరిస్థితుల్లో కూడా చికిత్స మరింత సమర్థవంతంగా అందుతుంది. రోగి అనుమతి లేకుండా ఆరోగ్య వివరాలను ఎవరూ చూడలేరని గోప్యతకు పూర్తి రక్షణ ఉంటుందన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ మనోహర్ జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి, జెడ్.పి.సి.ఇ.ఓ.శోభరాణి, ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ నోడల్ అధికారి డాక్టర్ సుమన్ కళ్యాణ్, ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ స్టేట్ ట్రైనర్ సాయి కుమార్, మున్సిపల్, పంచాయతీ రాజ్ శాఖల ప్రతినిధులు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# సీతారామ' పూర్తిచేస్తారా? లేదా?

- సీఎం రేవంత్ స్పష్టత ఇవ్వాలని డిమాండ్
- పూర్తి కోసం సీఎం పెట్టిన గడువు పూర్తి
- సీపీఐ(ఎం) పోరాట ఫలితంగానే 'దుమ్ముగూడెం'
- 2024, 2025 రబీ రైతుభరోసా సంగతేంటి?
- కాంగ్రెస్ ను ఆదరించినా ఖమ్మం జిల్లా నిరాదరణ
- 8 నెలలైనా 'సామినేని' హత్యకేసు తేల్చలే..!
- రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయి...
- ఖమ్మం జిల్లా విద్యారంగం ఖాళీలమయం
- ఏమి చేశారని రైతు, ప్రజా ఆశీర్వాదం
- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు మహబూబాబాద్ జిల్లాలోని ఏడు లక్షల ఎకరాలను సస్యశ్యామలం చేసే సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు ధ్వజమెత్తారు. నిధులను వరదలా పారించి ప్రాజెక్టును 2026 పంద్రాగష్టు లోగా అందుబాటులోకి తీసుకొస్తామని 2024 వైరా సభ, సీతారామ పంప్ హౌస్ ల ప్రారంభం సందర్భంగా హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దానిని తుంగలో తొక్కారన్నారు. ఈనెల 30న చింతకాని మండలంలో నిర్వహించే రైతు, ప్రజా ఆశీర్వాద సభకు హాజరవుతున్న సీఎం సీతారామ ప్రాజెక్టును పూర్తిచేస్తారో లేదో? స్పష్టతనివ్వాలని డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం) పోరాట ఫలితంగానే దుమ్ముగూడెం (సీతారామ) ప్రాజెక్టు సిద్ధించిందన్నారు. పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు, మాజీ ఎంపీ తమ్మినేని వీరభద్రంతో పాటు తానూ ఈ ప్రాజెక్టు సాధనకు పాదయాత్ర చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఖమ్మంలోని సుందరయ్య భవనంలో పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, కార్యదర్శివర్గ సభ్యులు వై.విక్రమ్, కళ్యాణం వెంకటేశ్వరరావు, యర్రా శ్రీనివాసరావుతో కలిసి బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పోతినేని మాట్లాడారు.

### నెలన్నర రోజుల్లో సీతారామ' పూర్తి చేయగలరా?

కాంగ్రెస్ ను ఆదరించిన ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులున్నా ప్రభుత్వం జిల్లాను నిరాదరణకు గురిచేస్తోందని పోతినేని అన్నారు. 2026 పంద్రాగష్టు లోగా సీతారామ ప్రాజెక్టును పూర్తిచేస్తామని స్వయంగా సీఎం పెట్టిన గడువు నెలన్నర రోజుల్లో పూర్తవుతుందని తెలిపారు. రూ.18వేల కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టు కోసం రూ.8వేల కోట్లు ఇప్పటికే ఖర్చుపెట్టామని, ఇంకా రూ.10వేల కోట్లతో ప్రాజెక్టు రెండేండ్లలో పూర్తవుతుందని 2024లో సీఎం చెప్పిన మాటను వీడియో రూపంలో ప్రదర్శించారు. సీఎం పెట్టిన 2026 పంద్రాగష్టు గడువుకు ఇంకా నెలన్నర రోజులు మాత్రమే ఉంది... చేయగలరా? అని ప్రశ్నించారు. రూ.18వేల కోట్ల అంచనాలు రూ.19వేల కోట్లకు చేరాయన్నారు. సీఎం హామీ ఇచ్చిన తర్వాత రెండు బడ్జెట్లు ప్రవేశపెట్టారని, రెండింటిలో కలిపి రూ.600 కోట్లు మాత్రమే కేటాయించారన్నారు. ముగ్గురు మంత్రులు తలా ఒక కాల్వ చొప్పున తవ్వుకుంటున్నారని తెలిపారు. శ్రీనివాసరెడ్డి మున్నేరు టూ పాలేరు లింక్ కెనాల్, తుమ్మల రాజీవ్, భట్టి జవహర్ కెనాల్స్ తవ్వుకుంటున్నారని వివరించారు. ప్రాజెక్టు పూర్తికాకుండా కాల్వలు తవ్వుకుంటే ఉపయోగం ఏంటని ప్రశ్నించారు. 2016 ఫిబ్రవరిలో కేసీఆర్ రోళ్లపాడు వద్ద ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారన్నారు. 2003లో సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని దుమ్ముగూడెం ప్రాజెక్టు కోసం 2,600 కి.మీ పాదయాత్ర చేశారని తెలిపారు. 2012లో తాను జిల్లా కార్యదర్శిగా ఉన్నప్పుడు దుమ్ముగూడెం నుంచి పాలేరు వరకూ వెయ్యి మంది రైతులతో తాను పాదయాత్ర చేసిన విషయాన్ని ప్రస్తావించారు. కృష్ణా గోదావరి అనుసంధానం కోసం ఉద్దేశించిన సీతారామ ప్రాజెక్టు విషయంలో కృష్ణా పరివాహక ప్రాంతంలో మంత్రులు కెనాల్స్ తీస్తూ పోతే ఉపయోగం ఏంటని ప్రశ్నించారు. 124 కి.మీ పొడవున్న సీతారామ ప్రాజెక్టు కెనాల్స్ లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేనాటికి 104 కి.మీ పూర్తయ్యాయని చెప్పారు. 104 కి. మీ వద్ద జూలూరుపాడు, దమ్మాయిగూడెం టన్నెల్స్ పూర్తి చేస్తే గోదావరి నీళ్లు పాలేరు రిజర్వాయర్ లో కలుస్తాయన్నారు. సీతారామ ప్రాజెక్టును పూర్తి చేస్తారా? లేదా? స్పష్టతనివ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్‌ను ఆదరించిన ఖమ్మం జిల్లాలో ఓ ప్రాజెక్టు పూర్తి చేశారా? ఓ పరిశ్రమ, ఓ యూనివర్సిటీ స్థాపించారా?




అని నిలదీశారు. ఏమి చేశారని రైతులు, ప్రజలు ఆశీర్వదించాలని ప్రశ్నించారు. ఎల్ నినో ఎఫెక్ట్ నేపథ్యంలో వర్షాభావ పరిస్థితులు ఏర్పడుతున్న దృష్ట్యా వేసిన పంటల్లో 30శాతం విత్తనాలు మొలకెత్తలేదన్నారు. ఈ నేపథ్యంలో గోదావరి నీళ్లు రాకపోతే ఏంటి పరిస్థితి? అని సీఎంను ప్రశ్నించారు. ఈ ఏడాది బడ్జెట్లో రూ.22వేల కోట్లు నీటిపారుదల ప్రాజెక్టులకు కేటాయిస్తే దీనిలో కేవలం రూ.360 కోట్లు సీతారామకు కేటాయించటం సిగ్గు చేటన్నారు. 2026 ఖరీఫ్ రైతుభరోసా నిధుల విడుదల కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఖమ్మం జిల్లాకు రావడాన్ని స్వాగతిస్తున్నామని పోతినేని తెలిపారు. కానీ 2024, 2025 రబీ రైతుభరోసా నిధులు ఇస్తారో... లేదో స్పష్టతనివ్వాలని డిమాండ్ చేశారు. పంటలు వేయడానికి ఇచ్చే రైతుభరోసా నిధులను సంవత్సరాల కొద్దీ పెండింగ్ పెట్టడాన్ని తప్పుబట్టారు.

### శాంతిభద్రతల క్షీణత

రాష్ట్రంలో మరీ ముఖ్యంగా ఖమ్మం జిల్లాలో శాంతిభద్రతలు క్షీణిస్తున్నాయని పోతినేని ఆరోపించారు. ఉమ్మడి రాష్ట్ర రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి సామినేని రామారావు హత్య జరిగి 8 నెలలవుతున్నా ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. ఈ హత్యకు పాల్పడిన వారిలో కాంగ్రెస్ వాళ్లు ఉన్నారని రామారావు భార్య చెబుతున్నా పట్టించుకోరా? అని నిలదీశారు. ఈ హత్య విషయమై తేల్చాలని మండల కేంద్రం మొదలు శాసనసభ దాకా దీనిని తీసుకెళ్లామన్నారు. సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అసెంబ్లీలో ప్రస్తావించిన విషయాన్ని గుర్తు చేశారు. ముఖ్యమంత్రిని ఈ విషయమై కలిసిన సందర్భాలను వివరించారు. రామారావు హత్య జరిగిన చింతకాని మండలంలోని సభకే సీఎం హాజరవుతున్న నేపథ్యంలో ఈ సభా వేదికపై నుంచే దీనికి సమాధానం చెప్పాలని కోరారు. హత్య, దొంతనం, రేప్ ఏది జరిగినా హోంశాఖ మంత్రిగానూ ఉన్న సీఎం పట్టించుకోరా? అని ప్రశ్నించారు.

### విద్యారంగానికి చేసిందేంటి?

ఖమ్మం జిల్లా విద్యారంగానికి ప్రభుత్వం చేసిందేంటని సుదర్శన్ నిలదీశారు. ఓ యూనివర్సిటీ నిర్మించారా? అని అడిగారు. ఖమ్మం జిల్లాలో 21 ఎంఈవో పోస్టులుంటే 19, డైట్ కళాశాలలో 13కు 13 పోస్టులు రెగ్యులర్ ఉద్యోగులు లేకుండా ఉన్నాయని తెలిపారు. విద్యార్థులకు పోషకాహారం అందించాలనే ఆలోచన మంచిదే అయినా ఆచరణ ఏదన్నారు. బ్రేక్ ఫాస్ట్ అమలవుతుందా? అని ప్రశ్నించారు. ఖమ్మం జిల్లా వ్యవసాయ, విద్యారంగ సమస్యలను పరిష్కరించేలా ఆచరణయోగ్యమైన దిశగా చర్యలు ఉండాలన్నారు. జిల్లా సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమిస్తామని ముఖ్యమంత్రి, మంత్రులను హెచ్చరించారు. జవాబుదారీ ఉండేలా సీఎం ప్రకటనలు ఉండాలని కోరారు.



## డ్రగ్స్ నిర్మూలనకు ప్రతి ఒక్కరు నడుం బిగించాలి

డి.నాగారంలో విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమం...

చౌటుప్పల్ సీఐ జి.మన్మథ కుమార్

**చౌటుప్పల్,జూన్ 25, క్రైమ్ మిర్రర్:** డ్రగ్స్, మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రతి ఒక్కరు నడుం బిగించి సహకరించాలని చౌటుప్పల్ సీఐ జి.మన్మథ కుమార్ కోరారు.సీఐ జి.మన్మథ కుమార్ ఆధ్వర్యంలో గురువారం చౌటుప్పల్ మండలం,దేవలమ్మ నాగారం గ్రామంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు డ్రగ్స్, మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమంను నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యంతో పాటు కుటుంబం, చదువు, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడుతుందని వివరించారు. డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఎవరైనా డ్రగ్స్ వినియోగించమని ప్రలోభపెడితే వెంటనే డయల్ 100 లేదా డయల్ 1062 టోల్ ఫ్రీ నెంబర్ కీ కాల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అలాగే సోషల్ మీడియా ద్వారా వచ్చే తప్పుడు ప్రలోభాలకు లోనుకాకుండా, మంచి స్నేహితులను ఎంచుకొని విద్య, క్రీడలు మరియు ఇతర సృజనాత్మక కార్యక్రమాలపై దృష్టి పెట్టాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో డ్రగ్స్ నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయించి, సమాజంలో డ్రగ్స్ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులతో పాటు గ్రామపంచాయతీ సిబ్బంది,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## మందమర్రిలో సింగరేణి ఉద్యోగులకు క్వార్టర్ల కౌన్సెలింగ్

సీనియారిటీ ప్రాతిపదికన 27 మందికి కేటాయింపు

109 క్వార్టర్లకు 175 మంది దరఖాస్తు



**మందమర్రి, జూన్ 25 (క్రైమ్ మిర్రర్):** సింగరేణి మందమర్రి ఏరియాలోని ఎన్‌సీడబ్ల్యూఏ ఉద్యోగులకు క్వార్టర్ల కేటాయింపు కోసం గురువారం స్థానిక సీఈఆర్ క్లబ్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. సీనియారిటీ ప్రాతిపదికన పారదర్శకంగా ఈ ప్రక్రియ చేపట్టినట్లు అధికారులు తెలిపారు.మొత్తం 109 క్వార్టర్లు అందుబాటులో ఉండగా, వాటి కోసం 175 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు. నిబంధనల మేరకు నిర్వహించిన కౌన్సెలింగ్‌లో అర్హత, సీనియారిటీ ఆధారంగా 27 మంది ఉద్యోగులకు క్వార్టర్లను కేటాయించినట్లు వెల్లడించారు.కౌన్సెలింగ్ ప్రక్రియను ఎస్వోటు జీఎం జి.ఎల్. ప్రసాద్, డిప్యూటీ పర్సనల్ మేనేజర్ విజయ్ సందీప్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ కార్తీక్, పర్సనల్ విభాగం ఓఎస్ రాజలింగు, మేనేజ్‌మెంట్ ట్రైనీ (సివిల్) ఆర్. వీణతో పాటు పర్సనల్ విభాగ సిబ్బంది పర్యవేక్షించారు.

## పోలియోకు చెక్..మూడు రోజుల ప్రత్యేక డ్రైవ్



- పుట్టిన శిశువు నుంచి ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు తప్పనిసరి : డాక్టర్ కళ్యాణి
- అంబట్‌పల్లిలో వైద్య సిబ్బందికి మార్గదర్శకాలు
- పల్స్ పోలియో విజయవంతానికి సమిష్టి కృషి అవసరం
- పోలియో రహిత భవిష్యత్తు కోసం అవగాహన కార్యక్రమం

**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవ్‌పూర్, పలిమెల మండలాల పరిధిలోని అంబట్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నేషనల్ పల్స్ పోలియో కార్యక్రమంపై శిక్షణ, అవగాహన సమావేశం వైద్యురాలు డాక్టర్ కళ్యాణి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కళ్యాణి మాట్లాడుతూ జూన్ 28, 29, 30 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.మొదటి రోజు పోలియో బూత్‌ల వద్ద పిల్లలకు చుక్కలు వేయగా, రెండో, మూడో రోజుల్లో ఇంటింటి సర్వే నిర్వహిస్తూ మిగిలిన పిల్లలకు పోలియో చుక్కలు వేయనున్నట్లు వివరించారు. ప్రతి చిన్నారి పోలియో చుక్కలు తీసుకునేలా తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. “మీ పాప నిండు జీవితానికి రెండు చుక్కలు” అనే నినాదంతో ప్రతి ఒక్కరూ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విజయ్‌కుమార్ (ఎంఎల్‌హెచ్‌పీ), వి. సోనాజీ (హెచ్‌ఈఓ), కె. సత్యనారాయణ (హెచ్‌వి), నర్సింగ్ ఆఫీసర్స్ మరియా, స్వప్న , ఫార్మాసిస్ట్ లక్ష్మి, డిఈఓ సౌమ్య, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సూపర్వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, కాంటిజెంట్ వర్కర్లు పాల్గొన్నారు.

## సంవిధాన్ హత్యా దివస్‌గా జూన్ 25ను పాటిద్దాం:

**ఎమర్జెన్సీ చీకటి రోజులను ప్రస్తుత తరానికి తెలియజేయాలి.. బీజేపీ మండల అధ్యక్షుడు సుధాకర**



**క్రైమ్ మిర్రర్ పాలేరు:** నేలకొండపల్లి: భారతీయ జనతా పార్టీ నేలకొండపల్లి మండల శాఖ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం మండల ప్రధాన కార్యదర్శి మల్లెపోయిన గోవిందరావు అధ్యక్షతన నిర్వహించారు ఈ సమావేశంలో బీజేపీ నేలకొండపల్లి మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్ మాట్లాడుతూ “1975 జూన్ 25న దేశంలో ఇందిరాగాంధీ సొంత ప్రయోజనాల కోసం అత్యవసర పరిస్థితిని విధించి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారు. “ఇకనుంచి జూన్ 25ను ఎమర్జెన్సీ డేగా కాకుండా ‘సంవిధాన్ హత్యా దివస్’గా వ్యవహరించాలని కేంద్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది. ప్రజాస్వామ్యానికి చీకటి అధ్యాయం అయిన ఈ దుర్దినాన్ని, అత్యవసర పరిస్థితి పేరుతో ఇందిరాగాంధీ, కాంగ్రెస్ పార్టీ సాగించిన మారణకాండను ప్రస్తుత తరానికి తెలియజేయాల్సిన అవసరం ఉంది” అని సుధాకర్ అన్నారు.”ప్రజాస్వామ్యానికి, ఈ దేశ ప్రయోజనాలకు భంగం కలిగించిన కాంగ్రెస్ పార్టీ నిజస్వరూపాన్ని బట్టబయలు చేద్దాం. రాజ్యాంగాన్ని అపహాస్యం చేసిన కాంగ్రెస్‌కు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే నైతిక హక్కు లేదు” అని ఆయన విమర్శించారు. ఈ సమావేశంలో మండల ఉపాధ్యక్షులు పురాణం దివాకర్, కొండా హర్షవర్ధన్, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు పిట్టల సూరిబాబు, బీజేపీ నాయకులు తొగటి నాగాచారి, ఎలివేటి వెంకటేష్, జోగపర్తి నారాయణ, రామారావు, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా సందర్శించిన డీఎంహెచ్‌ఓ డాక్టర్ నరేందర్ రాథోడ్

**మాతా శిశు సంరక్షణ కేంద్రం, డయాగ్నొస్టిక్ సెంటర్ల తనిఖీ**

**ప్రభుత్వ వైద్యాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి: డీఎంహెచ్‌ఓ**



**మంచిర్యాల, జూన్ 25 (క్రైమ్ మిర్రర్):** మంచిర్యాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ గురువారం జిల్లా కేంద్రంలోని మాతా శిశు సంరక్షణ కేంద్రం, పాలియేటివ్ కేర్ సెంటర్,తెలంగాణ డయాగ్నొస్టిక్ సెంటర్లను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాలలో రోగులకు అందుతున్న వైద్య సేవలను ఆయన ప్రత్యక్షంగా పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు,ఆదేశాలు జారీ చేశారు. మాతా శిశు సంరక్షణపై సమీక్ష: మాతా శిశు సంరక్షణ కేంద్రంలో అందుతున్న సేవలు, గర్భవతులు,శిశువుల సంరక్షణ కోసం తీసుకుంటున్న జాగ్రత్తలపై ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సుధాకర్ నాయక్, ఆర్ఎంఓ డాక్టర్ శ్రీధర్, స్పెషలిస్ట్ వైద్యులతో కలిసి డీఎంహెచ్ఓ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మే నెలలో ఈ కేంద్రంలో 342 ప్రసవాలు జరిగాయని,అందులో 137 సాధారణ ప్రసవాలు కాగా, 205 సిజేరియన్లు జరిగాయని వెల్లడించారు. దూర ప్రాంతాల నుండి వచ్చే రోగులకు ఇక్కడి ‘హెల్ప్ డెస్క్’ ఎంతో ఉపయోగపడుతుందని, గర్భవతులు,వారి కుటుంబ సభ్యులు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు గర్భవతులకు అన్ని రకాల పరీక్షలు నిర్వహించి,మాతా శిశు సంరక్షణ కార్డులలో వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా హైరిస్క్ గర్భవతుల వివరాలను ముందే హెల్ప్ డెస్క్‌కు చేరవేయాలన్నారు. ఎంసీహెచ్‌లో స్త్రీ, శిశు వైద్య నిపుణులు అందిస్తున్న సేవల పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేస్తూ,ఆసుపత్రిలో ఇంకా ఏవైనా సమస్యలు ఉంటే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. క్యాన్సర్ రోగుల సేవలు, ఉచిత పరీక్షలపై పర్యవేక్షణ అనంతరం పాలియేటివ్ కేర్ సెంటర్‌లో క్యాన్సర్ రోగులకు అందిస్తున్న సేవలపై వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్‌తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం తెలంగాణ డయాగ్నొస్టిక్స్ కేంద్రాన్ని సందర్శించి,అక్కడ ల్యాబ్ టెక్నీషియన్లతో సమీక్షించారు. తెలంగాణ డయాగ్నొస్టిక్స్ ద్వారా ప్రజలందరికీ ఉచితంగా 72 రకాల పరీక్షలు అందిస్తున్నట్లు డీఎంహెచ్ఓ తెలిపారు. పిహెచ్‌సిలు, సిహెచ్‌సిలు, జిల్లా ఆసుపత్రి నుండి వచ్చే రక్త నమూనాలను ఎప్పటికప్పుడు పరీక్షించి, ఆ నివేదికలను రోగులకు, సంబంధిత వైద్యాధికారులకు సకాలంలో అందేలా చూడాలని డాక్టర్ సృజన, మేనేజర్ వెంకటేష్‌లను ఆదేశించారు.అలాగే, డెంగ్యూ వ్యాధి నిర్ధారణ కోసం ఇక్కడ అందుబాటులో ఉన్న ‘ఎలిసా’ మిషన్ పనితీరును ఆయన ప్రత్యేకంగా పరిశీలించారు.ఈ కార్యక్రమంలో జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, వైద్యులు డాక్టర్ స్వాతి, రాజమణి, నర్సింగ్ ఆఫీసర్ సూపరింటెండెంట్, ల్యాబ్ టెక్నీషియన్లు, హెల్ప్ డెస్క్ సిబ్బంది మరియు ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# తెలంగాణ లంబాడీలకు ద్రోహం చేసిన కాంగ్రెస్ పార్టీ ప్రజలకు క్షమాపణ చెప్పాలి



లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు జర్పుల దశరథ్ నాయక్

**క్రైమ్ మిర్రర్, కల్వకుర్తి(కడ్తాల్):** తెలంగాణలో ఉన్న లంబాడీలకు కాంగ్రెస్ ప్రభుత్వం ద్రోహం చేసిందని బేషరతుగా తెలంగాణ లంబాడీలకు కాంగ్రెస్ పార్టీ క్షమాపణలు చెప్పాలని లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు, కడ్తాల్ మాజీ జడ్పీటిసి జరుపుల రాధాకృష్ణ మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ దశరత్ నాయక్ డిమాండ్ చేశారు. కడ్తాల్ మండల కేంద్రంలో గురువారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ?తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇందిరా గాంధీ లంబాడీలకు రిజర్వేషన్లను కల్పించి 50 సంవత్సరాలు పూర్తి అవుతున్న సందర్భంగా గిరిజనతరుణోత్సవాల బస్సు యాత్ర నిర్వహించడం స్వాగతిస్తామని.. కానీ ఇందిరమ్మ పేరు చెప్పి లంబాడి బిడ్డల ఓట్లతో అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలుగా లంబాడీలకు అన్యాయం చేస్తూ వచ్చారని దీనిపై సమాధానం చెప్పకుండా సర్వోత్సవాలు జరపడం కేవలం రాజకీయ లబ్ది కోసమేనని కాంగ్రెస్ యాత్రల నాయకులారా లంబాడి తండాల్లో అడుగుపెట్టే ముందు మా 54 ఏళ్ల అన్యాయానికి బంజారా సమాజానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ ఆశయాలను, ఎస్సీ ఎస్టీల హక్కులను కాలరాసిన చరిత్ర కాంగ్రెస్ పార్టీది అని ఆరు ఆరోపించారు.? ఇకపై మోసపోవడానికి లంబాడీలు సిద్ధంగా లేరని, హక్కుల రక్షణ కోసం మరో సంగారా భేరి మోగించడానికి వెనకాడబోమని హెచ్చరించారు. చేవెళ్ల డిక్లరేషన్ ఎన్నికల మేనిఫెస్టోలో గిరిజనులకు ఇచ్చిన హామీ అమలు చేశారా? పోడు భూములకు పట్టాలిచ్చారా? గిరిజన విద్యార్థులకు అందాల్సిన స్కాలర్షిప్ ఇచ్చారా?గిరిజనులకు అందాల్సిన సంక్షేమ పథకాలు ఇప్పటివరకు ఎందుకు రిలీజ్ చేయలేదని ఈ సందర్భంగా వారు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గిరిజన తండాల అభివృద్ధికి, సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ కార్పొరేషన్ కు ఇప్పటివరకు ఎన్ని నిధులు కేటాయించారో శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తండ గ్రామపంచాయతీలకు 25 లక్షల రూపాయలు స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్ వెంటనే విడుదల చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో చేవెళ్ల డిక్లరేషన్ లో గిరిజనులకు ఇచ్చిన 12 హామీలను వెంటనే అమలుచేసి చూపాలని తాండాలను రెవెన్యూ గ్రామ పంచాయతీలుగా గుర్తించాలని సూచించారు. సమావేశంలో సర్పంచులు సేవ్య నాయక్, శ్రీను నాయక్, మాజీ సర్పంచ్ శ్వేతా భూనాద్ మాజీ ఉపసర్పంచ్ రమణ వార్డ్ సభ్యులు దేవా నాయక్ మాజీ వార్డు సభ్యులు భీమన్ నాయక్ నాయకులు కోట్యా నాయక్ శీను నాయక్ భిక్య నాయక్ సక్రు నాయక్ చందర్ నాయక్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# క్యాతనపల్లిలో ఓటరు జాబితా సవరణ ప్రక్రియ పరిశీలన

**అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలి**

**మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి ఆదేశాల మేరకు పర్యవేక్షణ**

**పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు వొడ్నాల శ్రీనివాస్**



**క్యాతనపల్లి, జూన్ 25 క్రైమ్ మిర్రర్:** టీపీసీసీ నాయకత్వం, రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి, చెన్నూరు శాసనసభ్యులు గడ్డం వివేక్ వెంకటస్వామి ఆదేశాల మేరకు క్యాతనపల్లి మునిసిపాలిటీ పరిధిలోని వివిధ పోలింగ్ బూత్‌లలో కొనసాగుతున్న 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' ప్రక్రియను గురువారం కాంగ్రెస్ నాయకులు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా బూత్‌లలో జరుగుతున్న ఓటరు జాబితా సవరణ కార్యక్రమాలను క్షుణ్ణంగా పరిశీలించారు. బూత్ స్థాయి అధికారులు,బూత్ స్థాయి ఏజెంట్ లు స్థానిక నాయకులతో మాట్లాడి ప్రక్రియ పురోగతిని అడిగి తెలుసుకున్నారు. కొత్త ఓటర్ల నమోదు, చిరునామా మార్పులు, వివరాల సవరణలు, మరణించిన వారి పేర్ల తొలగింపు వంటి అంశాలను ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా, పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా క్యాతనపల్లి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు వొడ్నాల శ్రీనివాస్ మాట్లాడుతూ ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి మూలస్తంభమని పేర్కొన్నారు. అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి తప్పిపోకుండా కాంగ్రెస్ పార్టీ బూత్ స్థాయి నాయకులు, బీఎల్ఏలు ప్రత్యేక శ్రద్ధతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్లకు ఎస్ఐఆర్ ప్రక్రియపై అవగాహన కల్పించడంతో పాటు, అవసరమైన దరఖాస్తులను సకాలంలో సమర్పించేలా సహకరించాలన్నారు. ముఖ్యంగా వలస కార్మికులు, వృద్ధులు, మహిళలు, కొత్తగా 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న యువత పేర్లు ఓటరు జాబితాలో నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనల ప్రకారం ప్రతి దరఖాస్తును పరిశీలించి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు పనిచేయాలని ఆయన కోరారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటరు జాబితా అత్యంత కీలకమైనదని, ప్రతి కాంగ్రెస్ కార్యకర్త ఈ ప్రక్రియను విజయవంతం చేయడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, బూత్ స్థాయి కార్యకర్తలు, బీఎల్ఏలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# మందమర్రి సింగరేణి హై స్కూల్ లో 'యాంటీ డ్రగ్స్' అవగాహన సదస్సు

**ముఖ్య అతిథులుగా హాజరైన బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ కుమార్,సీఐ రమేష్**

**మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ**

**వ్యసనాలకు దూరంగా ఉండి ఉన్నత లక్ష్యాలను సాధించాలి: ఏసీపీ**



**మందమర్రి, జూన్ 25 (క్రైమ్ మిర్రర్):** మందమర్రి పట్టణంలోని సింగరేణి కాలరీస్ ఎయిడెడ్ హై స్కూల్ ప్రాంగణంలో విద్యార్థులకు మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలపై 'ఈగల్ ఫోర్స్ తెలంగాణ' పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ కుమార్, మందమర్రి సీఐ రమేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బెల్లంపల్లి ఏసీపీ మాట్లాడుతూ నేటి యువతే దేశానికి వెన్నెముక అని,విద్యార్థి లోకం గంజాయి,డ్రగ్స్ వంటి వ్యసనాల బారిన పడి తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని పిలుపునిచ్చారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ,క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని కోరారు. విద్యార్థి దశలోనే లక్ష్యాలను నిర్దేశించుకుని సమాజంలో బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని, తల్లిదండ్రులు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టాలని సూచించారు. సరైన కెరీర్ ప్లానింగ్ ద్వారా జీవితంలో అనుకున్నది సాధించవచ్చని ఉద్బోధించారు. డ్రగ్స్ సరఫరా లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు లేదా యాంటీ డ్రగ్ హెల్ప్‌లైన్ నంబర్ 1908 కు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో భాగంగా 'మాదకద్రవ్యాలకు నో చెపుదాం – జీవితానికి ఎస్ చెపుదాం'అంటూ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బందితో అధికారులు ప్రతిజ్ఞ చేయించారు. అలాగే డ్రగ్స్ వల్ల మానవ శరీర భాగాలపై పడే దుష్ప్రభావాలను వివరించే పలు అవగాహన పోస్టర్లను అధికారులు,పాఠశాల యాజమాన్యం కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మందమర్రి ఎస్ఐ నరేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, పోలీస్ సిబ్బందితో పాటు మండలంలోని సింగరేణి,కార్మెల్,లిటిల్ ఫ్లవర్,శ్రీచైతన్య, కృష్ణవేణి, మాంటిస్సోరి పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

# రివాగ్లో ద్వారా యువతకు మహిళలకు ఉపాధి అవకాశాలు

**రివాగ్లో యం డి వాసం రాధాకృష్ణ మాటల్లో**

**క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ఖమ్మం:** ఖమ్మంలో జరిగిన కార్యక్రమంలో ప్రస్తుత పరిస్థితుల్లో ఆరోగ్య మీద శ్రద్ధ చాలా తక్కువ అయింది కల్తీ ఆహార పదార్థాలు ఎక్కువైనాయి దీన్ని దృష్టిలో ఉంచుకోని ప్రజల యొక్క ఆరోగ్యం మరియు ఉపాధి కొరకు నిరుద్యోగ యువతకు ఇదొక మంచి సదవకాశం ప్రస్తుతం నిరుద్యోగం యువతకు పెద్ద సవాలుగా మారిన నేపథ్యంలో, స్వయం ఉపాధి మార్గాలు ఎంతో అవసరంగా మారాయి. ఈ నేపథ్యంలో సంస్థ యువతకు మంచి అవకాశాలను అందిస్తోంది. ఈ సంస్థ డైరెక్ట్ సెల్లింగ్ విధానంలో పనిచేస్తూ, ఆరోగ్యం, వ్యక్తిగత సంరక్షణ, గృహోపకరణాల వంటి విభాగాల్లో నాణ్యమైన ఉత్పత్తులను అందిస్తోంది. యువత ఈ ఉత్పత్తులను ప్రోత్సహిస్తూ, విక్రయాల ద్వారా ఆదాయం పొందే అవకాశం కలుగుతుంది. ప్రత్యేకంగా, విద్యార్థులు, ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్న వారు, గృహిణులు వంటి వారు పార్ట్ టైమ్ కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. క్రమంగా నైపుణ్యాలు పెంపొందించుకుంటూ, స్వయం ఉపాధి దిశగా ఎదగవచ్చు. అయితే, ఏ సంస్థలో చేరినా పూర్తి సమాచారం తెలుసుకుని, జాగ్రత్తగా ముందుకు సాగడం ఎంతో ముఖ్యమని నిపుణులు సూచిస్తున్నారు.



# రామచంద్రపురంలో యాంటీ డ్రగ్స్ అవేర్‌నెస్ కార్యక్రమం



మత్తు పదార్థాలకు దూరంగా ఉందాం.. యువతకు పోలీసుల పిలుపు

**క్రైమ్ మిర్రర్ పాలేరు:** నేలకొండపల్లి,మండలంలోని రామచంద్రపురం గ్రామంలో శుక్రవారం యాంటీ డ్రగ్స్ అవేర్‌నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. నేలకొండపల్లి పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు. నేలకొండపల్లి ఎస్ ఐ బి. కోటేశ్వరరావు మాట్లాడుతూ "గంజాయి, గుట్కా, మద్యం వంటి మత్తు పదార్థాలకు యువత బానిసై జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. ఒక్కసారి అలవాటు పడితే బయటపడటం కష్టం. కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నాయి" అని హెచ్చరించారు. డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలు, చట్టపరమైన శిక్షల గురించి వివరించారు. గ్రామంలో ఎవరైనా గంజాయి, ఇతర మత్తు పదార్థాలు విక్రయిస్తున్నా, సేవిస్తున్నా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని హెచ్ సి ఎం డి. కాసీం కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో , ఎస్ శ్రీనివాసరావు, శివలాల్, శ్రీను, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

# రామచంద్రపురంలో బొడ్రాయి, కనకదుర్గమ్మ, ముత్యాలమ్మ, మైసమ్మ తల్లి, ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

**భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహణ.. పెద్ద ఎత్తున హాజరైన గ్రామ ప్రజలు**



**క్రైమ్ మిర్రర్ పాలేరు** :నేలకొండపల్లి: మండలంలోని రామచంద్రపురం గ్రామంలో బొడ్రాయి, కనకదుర్గమ్మ, ముత్యాలమ్మ, మైసమ్మ తల్లి మరియు ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం నుంచి వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ గణపతి పూజ, పుణ్యాహవచనం, కలశ స్థాపన, హోమాలు నిర్వహించారు. శుభ ముహూర్తంలో విగ్రహాలకు ప్రాణ ప్రతిష్ఠ, కుంభాభిషేకం కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిపారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, రామచంద్రపురం గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకున్నారు. యువకులు, భక్తులు భజనలు, కోలాటాలతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నింపారు. గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠతో పాటు గ్రామ దేవతలైన కనకదుర్గమ్మ, ముత్యాలమ్మ, మైసమ్మ తల్లి, ఆంజనేయస్వామి విగ్రహాలను ప్రతిష్ఠించడం గ్రామానికి శుభ సూచకమని, ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖశాంతులు కలుగుతాయని గ్రామ పెద్దలు ఆకాంక్షించారు. విగ్రహ ప్రతిష్ఠ అనంతరం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుండి తరలివచ్చిన భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ గ్రామ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.